ఎక్కడపడితే అక్కడే మాంసం వ్యర్థాలు

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వ్యాపారులు
- చోద్యం చూస్తున్న శానిటేషన్ సిబ్బంది


మూతపడిన మున్సిపాల్టీ మేకల కబేళా ముందు పశుమాంస వ్యర్థాలు


బంగ్లామెట్ట శివాలయం ముందు రహదారి, డ్రైనేజీ వద్ద పశు మాంస వ్యర్థాలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో వందలాది మంది పారిశుధ్య కార్మికులు, పదుల సంఖ్యలో సూపర్‌వైజర్లు, ప్రతి సచివాలయానికి శానిటేషన్ కార్యదర్శులు, వార్డుకు ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్, జోన్‌కు అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఉన్నా ప్రయోజనం కనిపించడం లేదు. ఇంతమంది ఉన్నా కోళ్లు, మేకలు, పశు మాసం వ్యాపారులు ఎక్కడపడితే అక్కడ మాంస వ్యర్థాలు పడేస్తున్నా కళ్లు మూసుకుని ఉంటున్నారు. వ్యాపారులతో కుమ్మక్కై ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మామూళ్లు తీసుకుని వ్యర్థాలు డంపింగ్‌యార్డుకు తరలించకుండా నివాసాల చుట్టూ పడేసినా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండటంతో పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శానిటేషన్ విభాగం వైఖరితో ప్రధాన రహదారులు, చెరువులు, పవిత్ర గోస్తనీనది తీరాన్ని మాంస వ్యాపారులు కలుషితం చేస్తున్నారు. గతంలో బంగ్లామెట్ట శివారు గోస్తనీ నది వద్ద పశువులను వధించి అందులోనే వ్యర్థాలు వదిలిసేవారు. పశువుల ఎముకలను నదీ తీరంలో ఎండబెట్టి కల్తీ ఆయిల్ తయారీకి తరలించేవారు. ప్రస్తుతం ఆ ప్రాంతం చెట్లు, తుప్పలతో నిండిపోవడంతో వాటిని భీమిలి మున్సిపాల్టీ వారు నిర్మించి... మూతపడిన మేకల కబేళా వద్ద టన్నుల కొద్దీ డంప్ చేస్తున్నారు. దీంతో వీటిని పీక్కు తినడానికి కుక్కలు, పక్షులు తిష్ట వేస్తున్నాయి. మాంస ఖండాలను నోట కరచుకుని ఇళ్ల మధ్యలో, డాబాలపైన, వాటర్ ట్యాంకులపైన పడేస్తున్నాయి.

శివాలయం ముందే గుట్టలుగా...

ఇటీవల పశుమాంస వ్యర్థాలు, తోళ్లు, రక్తాన్ని వెంకటేశ్వరమెట్ట వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఫుట్‌పాత్‌పై వేసేశారు. ఇవి కుళ్లి బ్యాక్టీరియా వృద్ధి చెందడంతో దుర్వాసన వ్యాపించి ముక్కు మూసుకుంటేగానీ ఆ మార్గంలో రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు మరింత తెగించి ఆదివారం బంగ్లామెట్ట శివాలయానికి కేవలం వంద అడుగుల ముందు నూతనంగా నిర్మించిన బస్ షెల్టర్ పక్కనే డ్రైనేజీలో, రహదారిపై మాంస వ్యర్థాలను వ్యాపారులు పడేశారు.

దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రదేశం వద్ద పురాతన శివాలయంతోపాటు వందలాది ఇళ్లు, బేకరీలు, హోటళ్లు, నూనె గానుగ మిల్లులు ఉన్నాయి. ఇక్కడే నగరంలోని పలు డిపోలకు చెందిన సిటీబస్సుల సిబ్బంది చెట్ల నీడన విశ్రాంతి తీసుకుంటూ ఉంటారు. జుగుప్సాకరమైన ఈ విషయాన్ని శానిటేషన్ సిబ్బంది దృష్టికి మీడియా ప్రతినిధులు, స్థానికులు తీసుకెళ్లగా... ఏ ఒక్కరూ స్పందికపోగా సదరు పశుమాంస వ్యర్థాలు వేసే వ్యక్తి తమకు ఆత్మీయుడని, ఇంతటితో వదిలేయాలని, సోమవారం వచ్చి క్లీనింగ్ చేయిస్తామని ముక్తాయించారు. సదురు పశు మాంస వ్యాపారి ఇంతగా తెగిస్తున్నా చర్యలు తీసుకోవాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న శైలి చూస్తుంటే మొత్తం డిపార్ట్‌మెంట్‌పైనే పట్టణ ప్రజలు ఆగ్రహంగా ఉన్నారు. ప్రజల ఆరోగ్యంతో మాంస వ్యాపారులు, శానిటేషన్ విభాగం సిబ్బంది ఆటలాడుతున్నారని విమర్శిస్తున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి మాంస వ్యర్థాలు నివాసాల మధ్య కాకుండా డంపింగ్ యార్డుకు తరలించేలా గట్టిగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆపస్ జిల్లా కార్యవర్గం


ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆపస్ జిల్లా కార్యవర్గ సభ్యులు

పద్మనాభం: పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా కార్యవర్గ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షునిగా అవనాపు అరుణ్ కుమార్, గౌరవ అధ్యక్షునిగా కాళ్ల గోపీనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రయాగ త్రినాథమూర్తి, జిల్లా కోశాధికారిగా ఎం.ఎస్.వి.విశ్వనాథ్, జిల్లా కార్యదర్శులుగా వి.సతీష్, ఎ.సురేష్, బి.అప్పలరాజు, బి.రాజ్యలక్ష్మి, ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షులుగా ఎస్.రామారావు, ఆల్తి శ్రీనివాసరావు, వియ్యపు సత్యనారాయణ, ఆశపు ఈశ్వరరావు, బి.తమ్మినాయుడు, జిల్లా మహిళా కన్వీనర్‌గా డి.జయలక్ష్మి, ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా అయినాల అప్పారావు వ్యవహరించారు. ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఉమాగుప్త పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్ కుమార్ మాట్లాడుతూ పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని తీర్మానం చేసినట్టు తెలిపారు.

అధ్వానంగా శ్మశానవాటిక పరిసరాలు


తగరపువలస శ్మశానవాటిక వద్ద డంప్ చేసిన చెత్త, వ్యర్థాలు


చెత్త తగలబెట్టడంతో ఎగసిన పొగ

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు తగరపువలస శ్మశానవాటిక పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. చుట్టుపక్కల గ్రామస్తులు చెత్తను తీసుకొచ్చి శ్మశానవాటిక పక్కనే డంప్ చేస్తున్నారు. ఈ చెత్త పరిసరాల్లోని నదిలోకి ఎగిరి పడుతుండడంతో మిగిలిన వారు మంట పెడుతున్నారు. దీంతో శ్మశానవాటికకు వచ్చేవారికి మంటల సెగ తగిలి ఇబ్బందులు పడుతున్నారు. కళ్ల మంట, శ్వాసకోశ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. శ్మశానవాటిక పరిసరాల్లో ఎవరూ చెత్త వేయకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఇస్కాన్‌లో కార్తీక దామోదర ఉత్సవాలు ప్రారంభం


పూజలందుకున్న రాధాకృష్ణులు, జగన్నాథస్వామి

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం కార్తీక దామోదర మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వచ్చేనెల 28వ తేదీ వరకు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా రోజూ ఉదయం 4.30 నుంచి 6 గంటల వరకు మంగళహారతి, తులసి హారతి, భగవంతునికి నేతి దీప సమర్పణ, గజేంద్ర స్తుతి, దామోదరాష్టకం, గోపీ గీతం, శిక్షాష్టకం పారాయణ చేయనున్నారు.

శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు


శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సెలవు రోజు కావడంతో శ్రీవారిని దర్శించుకునేందుకు ఉదయం 7 గంటల నుంచి భక్తులు బారులు తీరారు. సుప్రభాత సేవ, తోమాల సేవ అనంతరం భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించారు. సాయంత్రం కోలాటం, అన్నమయ్య సంకీర్తనలు భక్తులను అలరించాయి.

'సురక్ష' శిబిరం నేడు

తగరపువలస: భీమిలి జోన్ ఆదర్శనగర్ – 1 వార్డు సచివాలయం పరిధిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరుగుతుందని జెడ్సీ బి.రాము తెలిపారు. ఈ శిబిరం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సంతపేట చిల్డ్రన్స్ పార్కు వద్ద జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సచివాలయ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు


గాంధీబొమ్మ వీధిలో మీనాక్షి అమ్మవారి నమూనాలో ప్రతిష్ఠించిన విగ్రహం

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు గాంధీ బొమ్మ వీధిలో విజయదశమి రోజున కాణిపాక యూత్ ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారి మట్టి విగ్రహం మధుర మీనాక్షి నమూనాలో ఉండగా ఆమె చుట్టూ మకర తోరణం, వేంకటేశ్వర సామి విగ్రహం ఉండేలా తీర్చిదిద్దారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు నిత్యం హోమాలు చేసి ప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. నవంబరు 4న అమ్మవారి విగ్రహం నిమజ్జనం చేస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు

తగరపువలస: ఇందిరా గాంధీ 39వ వర్ధంతి, సర్దార్ వల్లభాయ్ పటేల్ 148వ జయంతి సందర్భంగా భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్ర లేఖనం పోటీలు ఆదివారం నిర్వహించారు. వీరిద్దరి జీవిత విశేషాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 108 మంది తెలుగులో 48 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ సమైఖ్యతపై ఉపన్యాస పోటీల్లో 8 మంది, చిత్రలేఖనం పోటీల్లో 14 మంది పాల్గొన్నారు. వీరికి ఈ నెల 31న బహుమతులు అందిస్తామని కృష్ణారావు తెలిపారు.

ఏఎంసీ మాజీ చైర్మన్ నారాయణరావుకు ఘన నివాళి


నారాయణరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాగవంశీయులు

తగరపువలస: భీమిలి ఏఎంసీ చైర్మన్, వుడా డైరెక్టర్, మున్సిపాల్టీ వైస్ చైర్మన్‌గా మొకర నారాయణ రావు అనేక పదవులకు వన్నె తీసుకొచ్చారని రాష్ట్ర నాగవంశీయుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ అన్నారు. నారాయణరావు 89వ జయంతి సందర్భంగా కాళ్లవీధిలో ఆయన విగ్రహానికి రాష్ట్ర నాగవంశీయుల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం ఆమె నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాగవంశీయులు అందరినీ ఒక తాటిపైకి తీసుకొచ్చిన నారాయణరావు సామాజిక అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డు అప్పలనాయుడు, నాగవంశీయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, జేఏసీ విశాఖ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు, సభ్యులు కంటుభుక్త ముత్యాలరావు, సంకురుభుక్త జోగారావు, కాళ్ల సన్యాసినాయుడు, కనకల వెంకటరావు, కనకల పద్మావతి, కనకల అప్పలనాయుడు, కంటుభుక్త శ్రీనివాస్, మొకర నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

- భీమిలికి చెందిన టీడీపీ నాయకులు గంటా నూకరాజు, కొక్కిరి అప్పన్న, అప్పికొండ నూకరాజు, గండిబోయిన పోలిరాజు, భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తదితరులు మొకర నారాయణరావు జయంతి సందర్భంగా నివాళులర్పించారు.

నిత్యావసర సరకుల అందజేత


రమణారెడ్డి కుటుంబానికి సరకులు అందిస్తున్న దాతలు

తగరపువలస: చిట్టివలస కార్మికవాడలో పక్షవాతంతో మంచం పట్టిన గుజ్జు రమణారెడ్డికి ఆదివారం వెంపాడ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు అందించారు. నెల రోజులకు సరిపడా సరకులు, బియ్యం రమణారెడ్డి కుటుంబానికి ఇచ్చినట్టు దాతలు వెంపాడ శ్రీనివాసరెడ్డి, అక్కరమాని చినబాబు, పందిరి శ్రీనివాసరావు, అనకాపల్లి శివ తెలిపారు.

డ్రైనేజీలు నిర్మిస్తామని... తవ్వి వదిలేశారు


బైపాస్‌రోడ్డు సూర్యా నర్సింగ్ హోం పక్క సందులో డ్రైనేజీల దుస్థితి


డ్రైనేజీ తవ్వి జాతీయ రహదారి వైపు పడేసిన డెబ్రిస్

ఇబ్బంది పడుతున్న రామన్నపేట వాసులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బైపాస్‌రోడ్డు రామన్నపేట వద్ద డ్రైనేజీలు నిర్మిస్తామని... ఉన్న వాటిని తవ్వేసి డెబ్రిస్ పోగులు పెట్టి వదిలేశారు. సూర్యా నర్సింగ్ హోమ్‌ను ఆనుకుని ఉన్న వీధిలో డ్రైనేజీ సమస్యలు ఉండేవి. సాధారణ రోజులతోపాటు వర్షాకాలంలో హైవే డ్రైనేజీ మురుగు పొంగి ఈ సందులోని చిన్న కాలువలు నిండిపోయేవి. దీంతో ఆరు మాసాల క్రితం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా వచ్చిన భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి స్థానికులు తమ సమస్య తీసుకెళ్లారు. దీంతో ఆయన హైవే డ్రైనేజీ వరకు సందులో ఇరువైపులా రెండు కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. కాంట్రాక్టర్ ఆరు మాసాల క్రితం డ్రైనేజీల నిర్మాణానికి ఉన్న వాటిని తవ్వేసి డెబ్రిస్‌ను సర్వీస్ రోడ్డు వద్ద డంప్ చేశాడు. అనంతరం పత్తా లేకుండా పోయాడు. ఫలితంగా ఇప్పటికీ కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో ఇక్కడి వాతావరణం అధ్వానంగా తయారయింది. ఇళ్లలో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతోంది. ఇప్పటికైనా వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ అధికారులు జోక్యం చేసుకుని కాలువల నిర్మాణం జరిగేలా చూడాలని రామన్నపేట వాసులు కోరుతున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


రెడ్డిపల్లి ఉప సర్పంచ్ ఆదినారాయణకు భగవద్గీత అందజేస్తున్న సభ్యులు

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి, శేరిఖండం గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం చేశారు. శ్రీకృష్ణుడు జగద్గురువని, అందరూ భగవద్గీత చదివి గురు పౌర్ణమి రోజున శ్రీ కృష్ణ పరమాత్ముని గురువుగా పూజించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రెడ్డిపల్లి ఉప సర్పంచ్ ఆదినారాయణతోపాటు పలువురికి భగవద్గీత గ్రంథాలు అందజేశారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక విజయారాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథ, సభ్యులు జి.కృష్ణ సూరప్పడు, ఎస్.శ్రీనివాస్, వి.సురేష్, బి.అప్పలనాయుడు, కె.రాజు, ఆదమ్మ పాల్గొన్నారు.

తీరంలో సందడి


రుషికొండ బీచ్ వద్ద పర్యాటకులు

కొమ్మాది: బీచ్ రోడ్డు పర్యాటక ప్రాంతాల వద్ద ఆదివారం సందడి నెలకొంది. సాగర్‌నగర్ బీచ్, రుషికొండ బీచ్, తొట్లకొండ, రామానాయుడు ఫిల్మ్ స్టూడియో, మంగమారిపేట బీచ్, ఎర్రమట్టి దిబ్బలు, భీమిలి బీచ్‌కు పర్యాటకులు భారీగా తరలివచ్చారు. పిల్లలు, పెద్దలతో ఈ ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి.

ప్రమాదకరంగా కారుషెడ్ కూడలి మలుపు


కారుషెడ్ కూడలి నుంచి కొమ్మాది వైపునకు వెళ్లే సర్వీసురోడ్డు మలుపులో దుస్థితి

పీఎం పాలెం : కారుషెడ్ కూడలి నుంచి కొమ్మాది వైపునకు వెళ్లే సర్వీసు రోడ్డు మలుపు ప్రమాదకరంగా తయారయింది. ఈ ప్రాంతంలో సౌకర్యవంతమైన ఫుట్‌పాత్ కోసం నిర్మించిన కాంక్రీట్ పలకలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. దీంతో రాత్రి సమయంలో ప్రయాణించే వాహనాలు, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదాన్ని సూచిస్తూ కనీసం ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డు సైతం ఏర్పాటు చేయకపోవడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత శాఖ అధికారులు స్పందించి పరిస్థితి చక్కదిద్దాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

అమ్మవారి విగ్రహం ఊరేగింపు


తగరపువలస మెయిన్‌రోడ్డులో ఊరేగిస్తున్న అమ్మవారి విగ్రహం

తగరపువలస: దసరా ఉత్సవాల్లో భాగంగా చిట్టివలస కార్మికవాడలోని టాక్సీక్యాబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం ఆదివారం సాయంత్రం నిమజ్జనానికి తరలించారు. డీజే, బాణసంచాలతో అమ్మవారిని ప్రధాన వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి భీమిలి మండలం టి.నగరపాలెం వద్ద గోస్తనీ నదిలో నిమజ్జనం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు గుజ్జు రామ సూరిబాబు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

పైప్‌లైన్ నిర్వహణలో నిర్లక్ష్యం


రోడ్డుపైకి వచ్చిన పైప్‌లైన్ బోల్టు

పీఎం పాలెం : జీవీఎంసీ 6వ వార్డు పరిధిలో తాగు నీరు సరఫరా చేయడానికి వీలుగా అమర్చిన పైపు లైన్ బోల్టుల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా బోల్టులు సుమారు రెండు అంగులాలు మేర పలు చోట్ల రోడ్డుపైకి చొచ్చుకుని రావడంతో ఆ మార్గంలో ప్రయాణించే వారు ఇబ్బంది డుతున్నారు. వీటి మూలంగా ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో ఈ బోల్టులను గుర్తించడానికి వీలుగా రబ్బరు పైపులు పైన పెట్టేవారు. దీంతో ఆ ప్రదేశంలో పైపులైన్ బోల్టు ఉందని సులభంగా గుర్తించే వారు. ఇప్పుడా పరిస్థితి లేదు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు

శ్మశానంలో తుప్పల తొలగింపు


జేసీబీతో తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ శ్మసాన వాటికలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. స్థానిక యువకుల సహకారంతో శ్మశానవాటికలోని తుప్పలు తొలగించారు. వేముల ఈశ్వర్ రెడ్డి, దుంప సత్యం, గుడ్ల సోను, దుంప పవన్, బోర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేజీ వీడ్ ఆయిల్ స్వాధీనం

మద్రిపాలెం: వీడ్ ఆయిల్ విక్రయిస్తున్న ముగ్గురిని టాస్క్ ఫోర్స్, ఫిఫ్త్ టౌన్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. తిక్కవానిపాలెం వద్ద ఓ ఇంట్లో వీడ్ ఆయిల్‌తో ఉన్న బద్నాని రామారావు, వి.సోమలింగం, కొర్ర సత్తిబాబు పట్టుకుని ఒక కేజీ వీడ్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు.

మంచి చిత్రాలను ఆదరించాలి


కళాకారులను సత్కరిస్తున్న అతిథులు

సీతంపేట: ఇటీవల విడుదలైన మార్టిన్ లూథర్ కింగ్ సినిమాపై సమీక్ష, చిత్రంలో నటించిన విశాఖ కళాకారులకు సత్కార కార్యక్రమం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ, హాస్యప్రియ కామిడీ క్లబ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా కామెడీ క్లబ్ అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు విలువను చెబుతూనే, సమాజంలో అసమానతలను ఎత్తిచూపుతూ ఆలోచింపజేసే చిత్రం మార్టిన్ లూథర్ కింగ్ అని పేర్కొన్నారు. ఇటువంటి మంచి సినిమాలను ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. ఈ చిత్రంలో నటించిన విశాఖ కళాకారులు ఇమంది ఈశ్వరరావు, కె.సి.హెచ్.గోపినాయుడు, ఎస్.కె.మదీన(మల్లిక)లను అతిథుల చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో లీడర్ సంపాదకులు వి.వి.రమణమూర్తి, కాశీవిశ్వేశ్వరరావు, చిన్నారావు, త్రినాథరావు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ వలంటీర్ల నమోదే లక్ష్యం


పేద మహిళలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సీఈవో ఫరీదా, చైర్మన్ శ్రీధర్‌రెడ్డి

మహారాణిపేట: మిలియన్ వైఆర్‌సీ (యంగ్ రెడ్ క్రాస్) వలంటీర్ల నమోదే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు రాష్ట్ర రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీధర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ, సీఈవో ఎ.కె.ఫరీదా తెలిపారు. ఆదివారం విశాఖ రెడ్‌క్రాస్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను ఇంకా విస్తృత పరుస్తామన్నారు. విద్యార్థులు, వలంటీర్లను పెద్ద సంఖ్యలో చేర్చుకుని వారి ద్వారా పేదలకు వివిధ రకాల సేవలందించాలని నిర్ణయించామన్నారు. వీరిందరికీ ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించి రెడ్‌క్రాస్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎక్కువగా స్వచ్ఛందంగా రక్త దానం చేయడానికి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జగన్మోహనరావు, విశాఖ జిల్లా చైర్మన్ వై.శివనాగేంద్రరెడ్డి, కోశాధికారి సీహెచ్ వెంకటేశ్వరరెడ్డి, ప్రతినిధులు రావు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లో పూర్వ విద్యార్థుల సమావేశం

ఎంవీపీ కాలనీ: ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ (కాకినాడ) సమావేశం డిసెంబర్ 3న జరగనుంది. ఈ మేరకు సన్నాహక సమావేశం ఆదివారం ఎంవీపీ కాలనీలో జరిగింది. ఎంవీపీ కాలనీలోని ఐఏఎం వేదికగా ఈ సమావేశం నిర్వహించనున్నారు. జేఎన్‌టీయూకే పూర్వ విద్యార్థులంతా ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

అప్పన్నకు ఘనంగా నిత్య కల్యాణం


మాంగల్యధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.